## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

**నందలూరు :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 విభాగాలలో క్యారమ్స్ పోటీలలో నందలూరు హైస్కూల్ విద్యార్థులు తేజ కృష్ణ, పెంచలయ్య, నరసింహ, స్వర్ణలత, వెంకట స్నేహ, మల్లికార్జున, మాలశ్రీలు రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెడ్‌మాస్టర్ ఎస్.శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.కృష్ణయ్య, అసిస్టెంట్ హెడ్‌మాస్టర్ షేక్ రాఫ్‌బాషాలు తెలిపారు. అలాగే ఇటీవల బయనపల్లి, చింతకొమ్మదిన్నెలో జరిగిన అండర్–14 ఖోఖో పోటీలలో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన 7వ తరగతి విద్యార్థి నాగచైతన్య రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు.

### సైబర్ మోసాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భక్తవత్సలం

**సంబేపల్లె :** విద్యార్థులు చిన్ననాటి నుంచి సైబర్ మోసాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ భక్తవత్సలం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా జరిగే మోసాలను సైబర్ నేరాలుగా గుర్తించవచ్చు. సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు నొక్కరాదన్నారు. ఏటీఎంలు ఉపయోగించే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు ఉచిత ఎంబ్రాయిడరీ శిక్షణ



కిట్లు పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్ నందిని

**రైల్వేకోడూరు అర్బన్ :** పట్టణంలోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సహకార శిక్షణా సంస్థ సహకారంతో మహిళలకు గురువారం మగ్గం వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ శిక్షణను బ్యాంక్ మేనేజర్ నందిని, డీఆర్డీఏ వెలుగు ఏపీఎం వసుంధరలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రతి ఒక్కరూ ఇందులో శిక్షణ తీసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. అనంతరం శిక్షణ తీసుకుంటున్న మహిళలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోబల్ ట్రస్టు చైర్మన్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

### వీధిలైట్లు ఏర్పాటు

**ఓబులవారిపల్లె :** మండల పరిధిలోని వైకోట గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ మల్లం ఈశ్వరయ్య వీధి లైట్లను ఏర్పాటు చేశారు. వర్షాకాలం కారణంగా గ్రామంలో రాత్రి సమయంలో వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో సర్పంచ్ స్పందించి పాతవాటికి మరమ్మతులు చేయించి అవసరం ఉన్నచోట కొత్త లైట్లు ఏర్పాటు చేయించారు.

### నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**సంబేపల్లె :** మాజీ సర్పంచ్, వైఎసార్‌సీపీ సీనియర్ నాయకుడు అమీర్‌బాషా వైఎస్ఆర్‌సీపీకి తీరనిలోటని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్.సోమవరం గ్రామంలోని దేవళంపేటలో అమీర్ బాషా మృతదేహానికి విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి చిదంబరంరెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, నాయకులు, నివాళి అర్పించారు.

### దాడి కారకులను అరెస్టు చేయండి

**రాజంపేట :** దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ నేతలు గురువారం డీఎస్పీ సుధాకర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ నమోదు చేయాలని డీఎస్పీని కోరారు. అనంతరం దాడిలో గాయపడిన నరసింహులు, సుధాకర్‌లను వరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు డీసీ వెంకటయ్య, జిల్లా కార్యదర్శి పెంచలయ్య, పోలంరెడ్డి మల్లికార్జున, నందకుమార్ పాల్గొన్నారు.

# మినరల్ కాదు.. జనరల్!

- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు
- అనుమతుల్లేకుండా వెలుస్తున్న ప్లాంట్‌లు
- చోద్యం చూస్తున్న అధికారులు



వాటర్ ప్లాంట్

**గాలివీడు :** మండలంలోని పరిసర ప్రాంతాలలో మినరల్ వాటర్(శుద్ధజలం) పేరిట నీటి దందా జోరుగా సాగుతోంది. ఆదాయం ఉంటుండటంతో పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలకు తూట్లు పొడిచి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఈ దందాను రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల నుంచి వాటర్ ప్లాంట్ల వ్యాపారులు దందా చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. హోటళ్లు, చిరువ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు మినరల్ వాటర్ క్యాన్లు కొనడంతో నీటి వ్యాపారం అధికమైంది. అదే అదనుగా పలువురు వ్యాపారులు ఎక్కడ పడితే వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు.

**బోరు నుంచే తోడుతున్నారు**

ఇళ్లలో, ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇంటి బోరుతో వాణిజ్య అవసరాలకు వినియోగించుకోవడానికి వీల్లేదు. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయి. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వ్యయమవుతుంది. కానీ రూ.2 నుంచి 5 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. వీటిని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**నీటి శుద్ధి ప్రక్రియ ఇది..**

నిబంధనల ప్రకారం నీటిని 12 సార్లు శుద్ధి ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. ఫిల్టరింగ్, ఎరేషన్, కార్బన్ ఫ్యాక్టరైజేషన్ లాంటి ప్రకియలు జరపాలి. ఆ తర్వాత నీటిని డబ్బాల్లో నింపే ముందు 48 గంటలపాటు పక్కన నిల్వ ఉంచాలి. అనంతరం కెమిస్ట్ పరీక్షలు జరపాలి. ఇందుకోసం నాణ్యతా పరికరాలతో కూడిన మైక్రోబయలాజికల్ ల్యాబ్ ఉండాలి. కెమిస్టును నియమించుకుని ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించాల్సి ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా శుద్ధి చేసిన నీళ్లను తాగితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

**వ్యాపారానికి ఐఎస్ఐ, బీఎస్ఐ లాంటి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలి**

ఇసుక, కార్బన్, ఫిల్టరైజేషన్ ప్లాంట్లు తప్పనిసరిగా ఉండాలనే విషయాన్ని గుర్తించాలి. రివర్స్ అసోస్మిస్ సిస్టం ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించే వ్యవస్థ ఉందో లేదో తెలుసుకోవాలి. బయలాజికల్, బ్యాక్టీరియా పరీక్షలు జరుపుతున్నారో అడగాలి. ప్యాకింగ్‌పై వివరాలు ముద్రిస్తున్నారో లేదో గమనించాలి. రెండు ల్యాబ్‌లతోపాటు కెమిస్ట్, మైక్రో బయాలాజిస్టు ఉన్నారో లేదో కనుక్కోవాలి.

**శుద్ధమైన నీటిని అందించాలి**



వాటర్ ప్లాంట్ యాజమానులు నిబంధనల ప్రకారం నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందించాలి. నిబంధనలను ఉల్లంఘించి తాగు నీటి అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తాం.

– బాలాజీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గాలివీడు

## న్యూట్రిషన్ ఫుడ్ ఆవశ్యకతను తెలుసుకోవాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్

**రాజంపేట టౌన్ :** ప్రతి ఒక్కరు న్యూట్రిషన్ ఫుడ్ ఆవశ్యకతను తెలుసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఎస్ఎం.బాషా తెలిపారు. డిగ్రీ కళాశాలలో గురువారం న్యూట్రిషన్ అండ్ బేసిస్ ఆఫ్ బయాలజీ సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కోర్సు వల్ల నిత్యజీవితంలో న్యూట్రిషన్ ఫుడ్ ఏ విధంగా తీసుకోవాలన్న విషయాన్ని తెలుసుకుంటారని, అందువల్ల న్యూట్రిషన్ ఫుడ్ తీసుకునే విధానాన్ని తమకు తెలిసిన వారికి తెలియజేయాలన్నారు. ఈ కోర్సును విద్యార్థులకు అందించిన జువాలజీ విభాగం అధ్యాపకులను ప్రిన్సిపల్ అభినందించారు. సృజనాత్మక రైతు అవార్డు గ్రహీత ఆకేపాటి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కోర్సుల వల్ల విద్యార్థులు అదనంగా జ్ఞానం పొందవచ్చని తెలిపారు. ప్రతి సర్టిఫికెట్ భవిష్యత్తులో ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం జీవన విధానంలో ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉందన్నారు. సీజన్‌లలో దొరికే పండ్లను ప్రతి ఒక్కరూ విధిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాటనీ హెడ్ డాక్టర్ బి.ఆదినారాయణ, కోర్సు కో–ఆర్డినేటర్ నూకల చంద్రమోహన్, అధ్యాపకులు హనుమంతరావు, సుజాత పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పట్ల పోరాటాలకు సిద్ధం



స్థానికుల సమస్యలు వింటున్న సీపీఐ నాయకులు

**సుండుపల్లె :** ప్రజా సమస్యల పట్ల సీపీఐ పోరాటాలకు సిద్ధమని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్‌లు అన్నారు. గురువారం మండలంలోని పలు ప్రాంతాలను వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా మండలంలో అనేక రకాల సమస్యలు ఉన్నప్పటికీ నేటి పాలకులు ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. ఝరికోన ప్రాజెక్టు నిండా నీరు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సాగునీటి కాలువల మంజూరు చేయకుండా రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఝరికోన ప్రాజెక్టు సాగునీటి కాలువలకు నిధులు మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు పలు సమస్యలపై చర్చించారు.

## దళితవాడలు.. తాగునీటి వెతలు



చిన్నమండెం: నీటిసమస్యపై ఆరా తీస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు



ఓబులవారిపల్లె: తాగునీటి కోసం వేచివున్న చిన్నంపల్లి దళితవాడ మహిళలు

**చిన్నమండెం :** మండల పరిధిలోని చాకిబండ గ్రామం దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే అధికారులు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల) లిబరేషన్ అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన దళితవాడ ప్రజలు ఎదుర్కొంటున్న నీటిసమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ అధికారులకు స్థానిక ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిసమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రమణ, స్థానికులు భరత్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

**ఓబులవారిపల్లెలో..**

**ఓబులవారిపల్లె :** మండల పరిధిలోని చిన్నంపల్లి దళితవాడ గ్రామంలో తాగునీరు రాకపోవడంతో గ్రామస్తులు రెండు వారాలుగా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం పంటపొలాల వద్ద నీరు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపీడీఓ మల్ రెడ్డి మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గ్రామంలో ప్రజల అవసరం కోసం కొత్తబోర్లు వేయించామని, త్వరలో మోటార్ బిగించి సమస్యను పరిష్కరిస్తామని వారు తెలిపారు.

## రీ సర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభ



సుండుపల్లె: భూముల రీ సర్వేపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

**సుండుపల్లె :** మండల పరిధిలోని అక్కంపల్లి గ్రామం, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. అలాగే తహసీల్దార్ దైవాదీనం భూ హక్కుదారుల నుంచి భూముల రీ సర్వేపై ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో భూముల రీసర్వే నిర్వహించడం జరిగిందని, రీసర్వేలో ఏవైనా లోపాలుంటే సరిచేసుకోవడానికి గ్రామ సభలు ద్వారా వినతులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు నాయక్, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్‌ఓ విజయలక్ష్మి, సచివాలయ సర్వేయర్‌లు కీర్తన, జగదీష్‌రెడ్డి, యోగానందరెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రామాపురంలో గ్రామసభ**

**రామాపురం :** రీసర్వే ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ రామాంజులు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గువ్వల చెరువులో భూ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు గ్రామ సభ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇప్పటి వరకు 857.13 ఎకరాలు రీ సర్వే చేశామన్నారు. ఫిర్యాదులున్న రైతులు తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**గ్రామసభ తనిఖీ**

**సిద్దవటం :** మండలంలోని మోదీన్‌సాబ్‌పల్లె గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామ సభను సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలో రైతులు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను పరిష్కార దిశగా ఆమోదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌లు లావణ్య, శ్రీలత, మండల సర్వేయర్ ప్రియాంక, వీఆర్‌ఓలు శివశంకర్, సర్వేయర్‌లు ఇమ్మానుయేలు, పవన్, భవానీ, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయాలి



పోస్టుకార్డులను మహిళలకు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

**రాయచోటి అర్బన్ :** రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ గురువారం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో కాంగ్రెస్ నేతలు ప్రదర్శన చేశారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి గాజుల భాస్కర్ బస్టాండు నుండి వేంపల్లె, చిన్నమండెం వెళ్లే బస్సులలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన ఉచిత బస్సు ప్రయాణం అమలు డిమాండ్‌తో ముద్రించిన పోస్టుకార్డులను మహిళలకు అందజేసి సీఎం చంద్రబాబుకు చేరేలా పోస్టు చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అల్లాబకాష్, అమీర్, దర్బార్, మన్సూర్ అలీఖాన్, సర్దార్, అమీర్ బాషా, మహిళా నాయకురాళ్లు రమణమ్మ, నాగలతమ, నజీబ్‌జాన్, రమీజా తదితరులు పాల్గొన్నారు.

### రికార్డుల నమోదు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నైదియాదేవి

**రాజంపేట రూరల్ :** భూ రికార్డులను తప్పనిసరిగా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌చార్జీ తహసీల్దార్ పి.లవనకుమార్‌ను పలు విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు రికార్డులతోపాటు ఏపీఐఐసీ భూముల రికార్డులను పరిశీలించారు.

## ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాలు

**ఓబులవారిపల్లె :** ఏపీఎండీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం కార్మిక సంఘాల నాయకులు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏపీఎండీసీ దసరా పండుగకు యూనిఫామ్ ఇచ్చేదని కానీ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. అదే విధంగా దీపావళి పండుగకు ప్రాఫిట్ షేర్ ఇప్పటి వరకు ప్రకటించలేదని చెప్పారు. కావున వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ నాయకులు ఆర్.వెంకటేష్, భాస్కర్, కార్మికులు పాల్గొన్నారు.

## పాలకవర్గం సహకారంతో గ్రామాభివృద్ధి

**సిద్దవటం :** టక్కోలు పంచాయతీ పాలకవర్గం సభ్యుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివయ్య తెలిపారు. మండలంలోని టక్కోలు పంచాయతీ సమావేశం గురువారం సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ సమావేశంలో పలు అభివృద్ధి పనులకుగాను రూ. 6లక్షలు ఆమోదం తెలిపారన్నారు. గ్రామ కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ పంచాయతీలోని ఎస్సీ కాలనీకి తాగునీటి పైప్‌లైన్ కోసం రూ. 2లక్షలు, డేగనవాండ్లపల్లెలో సీసీ రోడ్ల మరమ్మతులకు రూ.2లక్షలు, చెత్తనుంచి సంపత తయారీ కేంద్రం పునరుద్ధరణకు, హరిత రాయబారులకు వేతనాలు చెల్లింపులకు రూ.2లక్షలకు సభ్యులు ఆమోదం లభించిందన్నారు. ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాగమునిరెడ్డి, సాంబశివారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణకు చర్యలు



అధికారులకు భద్రతా చర్యలు తెలుపుతున్న సీఐ

**రైల్వేకోడూరు అర్బన్ :** రెండు రోజుల క్రితం కోడూరు మండలంలోని మైసూరువారిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఈ విషయమై జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా జిల్లా రవాణాశాఖాధికారి ప్రసాద్, నేషనల్ హైవే అధికారి మనోజ్, సీఐ హేమసుందర్ రావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకొని ప్రమాద స్థలాల్లో తగిన విధంగా చర్యలు తీసుకోవడానికి అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ట్రాన్స్‌పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## టపాసులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దుకాణాదారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

**పుల్లంపేట :** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని టపాసుల దుకాణాదారులు అధిక ధరలకు టపాసులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అరవింద కిషోర్ అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా 9 మంది వినియోగదారులకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశామన్నారు. ప్రతి ఒక టపాసుల దుకాణాదారుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. టపాసుల దుకాణాల వద్ద ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టపాసుల దుకాణాదారులు లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోండి



జీవాలకు మందును వేస్తున్న మాలకొండయ్య

**చిన్నమండెం :** గొర్రెలకు, మేకలకు అందించే నట్టల నివారణ మందును పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ రాయచోటి డివిజన్ ఉపసంచాలకులు మాలకొండయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నర్సుపల్లెలో జీవాలకు వేస్తున్న నట్టల నివారణ మందును స్థానిక పశువైద్యుడు గణేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నట్టల నివారణ మందులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సన్నజీవాలకు, చిటుకు వ్యాధి, బొబ్బలరోగం, నీలినాలుక వంటి వ్యాధులకు నిరోధక టీకాలను ఉచితంగా వేస్తామన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

**రామాపురం :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కింగ్ హాస్పిటల్ వైద్యులు రుబీనా హజిరా పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నీలకంఠరావుపేటలో మైనార్టీ నాయకుడు అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

## విద్యార్థి కుటుంబానికి కొరముట్ల పరామర్శ



విద్యార్థి శివశంకర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

**రైల్వేకోడూరు అర్బన్ :** మండలంలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన కొలవల మహేశ్వర్‌రెడ్డి కుమారుడు శివశంకర్‌రెడ్డి (17) హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కాలేజ్‌లో ఇంటర్ అభ్యసిస్తున్నాడు. రెండురోజుల క్రితం ప్రమాదవశాత్తు బిల్డింగ్ ఐదవ అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. చిన్న వయసులో ఇలా జరగడం దురదృష్టకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ హరికృష్ణ, చింతల రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

**సిద్దవటం :** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు సిద్దవటం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని 9, 10వ తరగతులు విద్యార్థులకు రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామన్నారు. వ్యాసరచన పోటీల్లో జి.లక్ష్మీప్రసన్న, ఎ.పల్లవి, ఎం.మువనశ్రీ, వక్తృత్వ పోటీల్లో బి. శ్రీవిద్య, కె. ఇందు, ఎస్.సానియా గెలుపొందగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణ

**నందలూరు :** లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రంథాలయంలో ఈట్ దట్ ఫ్రాగ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ ఒక రోజును పనుల పరంగా, ప్రణాళికబద్ధంగా ఎలా విభజించుకుని చేసుకుంటే సంపూర్ణ ఫలితం సాధించవచ్చన్న విషయాలు ఇందులో తెలియజేశారు. అనంతరం పుస్తకం పాఠకులు చదువుకొనేందుకు గ్రంథాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయభాస్కర్ రావు, మోడపోతుల రాము, ఉప్పుశెట్టి సుధీర్, కొత్తపల్లి రాజాచారి, గంధం గంగాధర్, గుండు సురేష్, గాడి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తల్లి పేరిట మొక్కను నాటాలి

**వీరబల్లి :** ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, వీఆర్‌డీఎస్ సంస్థ సంయుక్తంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి, సిబ్బంది నాగయ్య, శ్రీను, గోపి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### వైభవంగా గ్రామోత్సవం



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న మాతమ్మ

**ఒంటిమిట్ట :** మండల కేంద్రంలోని అరుంధతివాడ కాలనీలో మాతమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా సాగుతోంది. గురువారం ముందుగా ఆలయంలో మాతమ్మతల్లి రాతి విగ్రహానికి అర్చకులు బాలు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తప్పెట్లు, బాణసంచా పేలుళ్ల మధ్య అమ్మవారి విగ్రహానికి గ్రామోత్సవం జరిపారు. కాగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. తదుపరి సాయిలోకేష్‌ను కార్యనిర్వాహకులు చెంచుగార్ల పుల్లయ్య శాలువా, పూలమాలతో సత్కరించారు.

### ప్రభుత్వ పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి జియావుల్లా

**వీరబల్లి :** దిగువరాచపల్లి పంచాయతీలో పెద్దహరిజనవాడ దగ్గర ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలను గురువారం మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జియావుల్లా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అక్కడి సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.